ప్రజాశక్తి
సోమవారం 15 జులై 2024

ప్రారంభమైన ఉబాలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గుడ్డిపేట గ్రామ పరిధిలో ఆదివారం రైతులు వరి ఉబాలు ప్రారంభించారు. సకాలంలో వర్షాలు పడడంతోనూ, అలాగే పంపుసెట్ల ద్వారా నీరు ఉండడంతో నాట్లు వేసేందుకు రైతులు పనులు ప్రారంభించారు. అలాగే శనివారం సాయంత్రం కురిసిన వర్షంతో కొంత మేరకు రైతులకు ఆశాజనకంగా ఉంది.

నాట్లు వేస్తున్న రైతులు

అమ్మకడుపులోంచి బయకు వచ్చి ఇంకా ఆరు మాసాలు పూర్తికాలేదు. అమ్మ జోలపాట తప్ప మరే గొంతునూ గుర్తుపట్ట లేనంత పసితనం. జోలాలీ.... అంటూ అప్పటి వరకు అమ్మ పాడుతున్న జోలపాటతో నిద్రలోకి జారుకుంటున్న సమయమది. అంతలోనే ఓ మానవ మృగం పైశాచిక దాడికి పాల్పడింది. ఉయ్యాల్లో నిద్రిస్తున్న పాపాయిపై పంజా విసిరింది. వయో భేదం, వావివరుసలు మరిచి మానవ రూపంలో సంచరిస్తున్న ఆ మృగం ఏకంగా అత్యాచారానికి పాల్పడింది. అంతలోనే పాపాయి వద్దకు వచ్చిన తల్లి తల్లడిల్లిపోయింది. ఇంకా తన రక్తపు ముద్దగానే భావిస్తున్న ఆ పాపాయి తీవ్ర రక్తస్రావంతో ఒకటే ఏడుపు. ఆ దృశ్యంతో తల్లి నిర్ఘాంతపోయింది. ఆమె రోదన అంతా ఇంతా కాదు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న ఆ చిన్నారిపై ఇటువంటి అకృత్యం చోటు చేసుకోవడం.. తల్లిగా ఆమెను మాత్రమే కాదు, సగటు మనిషిని కలచివేసింది. ఎంతో మంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామభద్రపురం మండలం కొండకెంగువ పంచాయతీ జీలికవలస గ్రామంలో చోటు చేసుకున్న ఈ సంఘటన సగటు మానవాళి హృదయాలను కలచివేసింది. నేరెళ్లవలస కేంద్రంగా సంచరిస్తున్న ఈ మానవ మృగం అకృత్యాలు వెలుగులోకి వస్తున్నాయి.

నిందితుడు ఎరకన్నదొర

నేరెళ్లవలసలో మానవ మృగం

- మహిళలు కనిపిస్తే పైశాచికమే
- తాజాగా పసికందుపై అత్యాచారంతో వెలుగులోకి
- నిర్ఘాంతపోతున్న మానవ లోకం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / రామభద్రపురం

జీలికవలసలో పసికందుపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు బోయిన ఎరకన్నదొర (40) బయట ఉంటే మహిళలకు భద్రత లేనట్లే లెక్క. కంటికి మనిషిలా కనిపిస్తున్నప్పటికీ కొన్నాళ్ళుగా మానవ రూపంలోని మృగంలానే ప్రవర్తిస్తున్నాడని ఆయన స్వగ్రామం నేరళ్లవలస జనమంతా చెప్పుకుంటున్నారు. ప్రవర్తన బాగా లేకపోవడంతో ఐదేళ్ల క్రితమే భార్య వదిలి వెళ్లిపోయింది. కొడుకును కూడా ఆయన వద్ద ఉంచేందుకు సాహసించలేదు. పూటుగా తాగడం, చిన్న పెద్ద, వావివరసలతో సంబంధం లేకుండా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, వేధించడం ఆయనకు పరిపాటేనట. ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని ఏకంగా ఇళ్లల్లోకి చొరబడిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. కొంతకాలంగా స్థానికంగా ఉన్న బాలికల వసతి గృహం గోడలు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నట్టు స్థానికులు చెప్పుకుంటున్నారు. ఎరకన్న తండ్రి గ్రామ పెద్ద కావడంతో తామేమీ చేయలేకపోతున్నామని కూడా ఆ గ్రామానికి వెళ్లిన విలేకర్ల బృందానికి పలువురు చెప్పారు. కొడుకు చేష్టలకు తండ్రి వంతపాడకపోయినప్పటికీ, పరువు పోతుందనే భయంతో పలు సందర్భాల్లో బాధితుల కాళ్లపట్టుకుని క్షమాపణ కోరడంతో వ్యవహారాలు పోలీస్ స్టేషన్ల వరకు వెళ్లడం లేదని సమాచారం.

ఎరకన్న దొర తల్లిదండ్రులు గ్రామంలో పరువుగలిగిన వాళ్లే. కొన్ని దశాబ్దాలుగా గ్రామంలో పెద్దరికం వహిస్తున్నారు. కానీ, తన కొడుకును తగిన రీతిలో పెంచడంలో విఫలమయ్యారు. ఎరకన్నదొరను చదివించేందుకు తల్లిదండ్రులుగా ఎంతో తాపత్రయపడినా సరిగా స్కూల్‌కి వెళ్లేవాడు కాదట. విసుగు చెంది వదిలేయండంతో మహిళలపాలిట మృగంగా మారిపోయాడు. న్యాయం కోసం తన తండ్రి వద్దకు వచ్చిన మహిళలపై కూడా అసభ్యంగా వ్యవహరించేవాడట. ఇటువంటి సందర్భాల్లో తల్లిదండ్రులు ఖండించి గట్టిగా చెప్పడం మినహా దండించలేకపోయారు. కొడుకు పట్ల ఆ మెతక వైఖరే చివరకు నేడు పెద్దరికాన్ని, పరువును తీసేసింది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు కొడుకు చేష్టలతో ఖైదుగా మారే పరిస్థితి వచ్చాక తండ్రి.. 'తన కొడుకును అప్పగిస్తే గొడ్డలి వేటుతో చంపేస్తానంటూ పుట్టెడు దు:ఖంతో చెబుతున్నాడు.

జిల్లాలో అత్యాచారాలు, అందులోనూ అభం, శుభం తెలియని చిన్నారులపై పైశాచిక చర్యలు అడ్డూ అదుపూ లేకుండా సాగుతున్నాయి. గడిచిన కొద్ది కాలంలో పరిశీలిస్తే విజయనగరంలోని కణపాక ప్రాంతంలో కన్నతండ్రే కూతురిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. భోగాపురంలో ఐదేళ్ల బాలికపై యువకుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఎస్.కోటలో తాత మనుమరాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అదే ప్రాంతంలోని బొడ్డవర మీదుగా నడిచి వస్తున్న బాలికకు బైకు లిఫ్ట్ ఇచ్చినట్టు నమ్మించి, ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి మానవ మృగంగా మారిపోయాడు. ఇంకా వెలుగులోకి రాని సంఘటనలు ఎన్నో. ఇటువంటి సందర్భాల్లో నమోదవుతున్న కేసులపై పాలకులు పారదర్శకంగా వ్యవహరించకపోవడం, రాజకీయ జోక్యాలు పెచ్చుమీరుతుండడం, కేసుల పరిష్కారానికి కాలయాపన చేయడం, నిందితులు అనుభవిస్తున్న శిక్షలు కూడా బయటకు తెలిజేసే విధంగా చర్యలు తీసుకోకపోవడం వంటి వాటి వల్ల పదేపదే ఇటువంటి అకృత్యాలకు అవకాశం కలుగుతోందని పలువురు విశ్లేషిస్తున్నా రు. ఈ నేపథ్యంలో పిల్లల పెంపకంతోపాటు నిందితులపై కఠిన శిక్షలు అమలు చేసే విధంగా ఇటు తల్లిదండ్రులు, అటు ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరిం చాల్సి ఉందని పలువురు అభి ప్రాయ పడుతున్నారు.

వెల్లువెత్తిన ఆగ్రహం

ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేస్తాం

విజయనగరం ఘోషాసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని ఆమె తల్లిని మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, విజయ నగరం, బొబ్బిలి ఎమ్మెల్యేలు పి.అదితి గజపతిరాజు, బేబినాయన పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మడి సంధ్యారాణి పరామర్శించి, భరోసా ఇచ్చారు. శిశువుకు మరిన్ని వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం సంధ్యారాణి మీడియాతో మాట్లాడుతూ చట్టపరంగా అందాల్సిన ఆర్థిక సాయాన్ని వెంటనే అందిస్తామన్నారు. నిందితుడిని వీలైనంత త్వరగా, కఠినంగా శిక్షించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కనీసం బెయిల్ కూడా రాకుండా చూడాలని న్యాయవాదులకు ఆమె విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి, రామభద్రపురం తహాశీల్దార్ సులోచనారాణి, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ విజయలక్ష్మి ఉన్నారు. అలాగే మంత్రి శ్రీనివాస్ చిన్నారి యోగక్షేమాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులతో మాట్లాడారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

అత్యాచార ఘటనపై ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు విచారం వ్యక్తంచేశారు. సంఘటన వివరాలను, బాధిత బాలిక ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

చిన్నారిపై అత్యాచార యత్నం ఘటనపై జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సంఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు.

ఐద్వా నిరసన

పసికందుపై అత్యాచారం చేసిన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు పుణ్యవతి ఆధ్వర్యాన రామభద్రపురం సచివాలయం వద్ద నిరసన చేశారు. నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని డిఎస్‌పికి వినతిని ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీను, ఐద్వా నాయకులు పద్మ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న పసికందును, తల్లిని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు విజలక్ష్మి, వేగోటి లక్ష్మి, సహాయ కార్యదర్శి డి.కరుణ పరామర్శించారు.

సదస్సులో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

కామన్ స్కూల్ విధానం ప్రవేశపెట్టాలి

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్‌ఎస్ ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గత ఐదేళ్ల పరిపాలించిన ప్రభుత్వం విద్యారంగాన్ని సర్వనాశనం చేసిందని, ప్రస్తుతం దాన్ని సరి చేసేందుకు రాష్ట్రంలో అందరికీ ఒకే స్కూల్, ఒకే సిలబస్ ఉండేలా కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ కోరారు. ఆదివారం స్థానిక ఎస్‌విడి కళాశాలలో జరిగిన 'ప్రత్యామ్నాయ విద్యా విధానం' అన్న అంశంపై జరిగిన చర్చ ఆయన మాట్లాడారు. ప్రస్తుత విద్యా విధానంలో సిబిఎస్‌ఇ సిలబస్, ఐబి ఇంటర్నేషనల్ బకార్యో సిలబస్ కొనసాగుతున్నాయన్నారు. దీనివల్ల విద్యార్థుల్లో అంతరాలు పెరిగి పోతున్నాయన్నారు. కనుక ఒకే సిలబస్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాథమిక పాఠశాల వ్యవస్థ పటిష్టంగా ఉండేలా చర్యలు ప్రారంభించాలన్నారు. ఎల్‌కె, యుకెజిని ప్రారంభించి ప్రాథమిక పాఠశాలలో 3,4,5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేసే చర్యలను ఆపాలని కోరారు. సర్క్యులర్ నంబర్ 172ను, దాంతోపాటు 117 జీవోను వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.కిశోర్‌కుమార్, ఆర్.మోహనరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు, జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.భాస్కర రావు, రాష్ట్ర కౌన్సిలర్లు మధురాజ మణి, రాజకుమారి, పిబి రాయుడు, వి.జ్యోతి, కె.మురళి పాల్గొన్నారు.

భారీ వర్షాలకు రెండిళ్లు నేలమట్టం

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గుమ్మలక్ష్మీపురంలోని గ్రామీణ బ్యాంక్ వీధిలో ఉన్న తంగుడు ఫకీరు నాయుడు, చింతల విమల రాణికి చెందిన ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఈ సంఘటన ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో జరిగింది. భారీ వర్షాల కారణంగా విమల రాణి ఇల్లు పైభాగం ఒక్కసారిగా కూలిపోగా, పకీరు నాయుడు ఇంటి పైన పడింది. ఇది గమనించిన ఫకీరునాయుడు కుటుంబ సభ్యులు ఒక్కసారిగా అప్రమత్తమై భయంతో ఇంటి లోపల నుంచి బయటకు పరుగులు తీశారు. చిన్నారులు నిద్రిస్తున్న గదిలోనే పైభాగం సగం వరకు వచ్చి కూలింది. నిమిషం పాటులో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సుమారు రూ.3లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని భావిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్ రావు, పంచాయతీ కార్యదర్శి కిషోర్ కుమార్ సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి బాధితులను పరామర్శించారు.

కూలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న సర్పంచ్ గౌరీశంకర్

సభలో మాట్లాడుతున్న కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు శ్రీనివాసరావు

కట్టి పడేసిన 'కథా సంధి'

ప్రజాశక్తి - విజయనగరం కోట

సుప్రసిద్ధ రచయిత గంటేడ గౌరునాయుడు చదివిన కథ శ్రోతులను కట్టి పడేసింది. ఆదివారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ మినిస్టరీ సమావేశ మందిరంలో సాహిత్య అకాడమీ సాహితి స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో కథాసంధి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రముఖ గజల్ వినోద్ గౌరునాయుడు రచించిన గేయాలను తమ గజల్‌తో శ్రోతులను అలరించాడు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ గౌరు నాయుడును పరిచయం చేస్తూ ఆయన సాహిత్య జీవితం 1980లో శారద పెళ్లి, ఏటి పాట, ఒక రాత్రి రెండు స్వప్నలు కథలు సంపుటితో మొదలైందన్నారు. కవిత్వం నాగలితోపు, అనువాదం గీతాంజలి తోను చేస్తారన్నారు. పాడుదామా స్వేచ్ఛా గీతం గేయంతో ప్రపంచానికి పరిచయం అయ్యామన్నారు. బహుముఖ ప్రజ్ఞశాలి అని కొనియాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆయన్ని ప్రపంచం గుర్తించిందన్నారు. అనంతరం కథాసంధిలో భాగంగా గంటేడ గౌరునాయుడు లాబేసు-పూర్ణ పాడు ఒక సంపూర్ణ వంతెన అనే తన కథను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో గుజ్జుంగిరావు, ధనుంజయ్, జిఎస్ చలం, ఎన్‌కె బాబు, సుభద్ర, గోపాలరావు, చింతాడ అప్పలనాయుడు, పక్కి రవీంద్ర, దాసు, పాయల మురళీకృష్ణ, జక్కు రామకృష్ణ, చంద్రిక రాణి, సిరికి స్వామినాయుడు, గాయకులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

నర్సిపురంలో భారీ చోరీ

ఒకే రాత్రి మూడిళ్లలో దొంగతనం

30 తులాల బంగారు, కేజీ వెండి అపహరణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని పలు కాలనీలతో పాటు, గ్రామాల్లో గత కొద్ది రోజులుగా తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దోపిడీ దొంగలు రెచ్చిపోయి చోరీలకు పాల్పడుతున్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలోనూ, ప్రస్తుత ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర నివాసం పక్కనే వెంకంపేట పంచాయితీ బాలాజీనగర్‌లో రెండు రోజుల క్రితం జరిగిన దొంగతనం మరిచిపోక ముందే శనివారం రాత్రి నర్సిపురంలోని పెద్దవీధి, కుమ్మరి వీధికి చెందిన మూడు ఇళ్లల్లో చోరీ జరిగింది. ప్రధాన ద్వారం తాళాలను విరిచి దొంగతనం చేసిన సంఘటన మండలంలో సంచలనం రేపుతుంది.

నర్సిపురం పెద్దవీధికి చెందిన సిరిపురపు జగన్నాథం, వెంకటి నాయుడు అన్నదమ్ములు పక్కపక్కన ఇళ్లలోనే ఉంటున్నారు. శనివారం వారి సొంత పనులపై ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లగా కనిపెట్టిన దొంగలు రెండు ఇళ్లల్లోనూ సుమారు 30 తులాల బంగారం, కేజీన్నర వెండి, రూ.60 వేల నగదు తస్కరించారు. అలాగే కుమ్మరి వీధికి చెందిన గవర వెంకటనాయుడు సొంత పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లగా వారి ఇళ్లల్లో తాళాలు విరిచేసి దొంగతనానికి పాల్పడ్డారు. వారి ఇంట్లో సుమారు కేజీ వెండి కొంతమేరకు నగదు పోయినట్లు గ్రహించారు. సాధారణంగా పట్టణాల్లో తాళం లేని ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు జరుగుతుండగా ఇప్పుడు ఆ జాడ్యం పల్లెటూర్లకు పాకడంతో గ్రామీణులు బెంబేలెత్తుతున్నారు. ఈ మూడు చోరీలపై, బాధితుల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై దినకర్ కేసులు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

దొంగలు విరగ్గొట్టిన బీరువా లాకర్

ఎరువులు, విత్తనాల కొరత లేకుండా ఏర్పాట్లు

- అధిక దిగుబడులే లక్ష్యంగా రైతులకు అవగాహన
- లక్షా 78 వేల ఎకరాల్లో వరిసాగు
- ఆశాజనకంగా వాతావరణం
- 'ప్రజాశక్తి'తో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్ పాల్ ముఖాముఖి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

మన్యం జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు జిల్లా వ్యవసాయాధి కారి రాబర్ట్ పాల్ తెలిపారు. అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా రైతులకు అవగాహన కల్పిస్తూ వారికి అన్ని రకాల విత్తనాలు, ఎరువులు అందించేలా ఈ ఏడాది సీజన్‌కు పక్కా ఏర్పాట్లు జరిపినట్లు చెప్పారు. తనను కలిసిన ప్రజాశక్తికి వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఈ ఏడాది వరి సాగుపై మీ అంచనాలు ఏమిటి?

జిల్లాలో ఖరీఫ్‌లో లక్షా 78వేల ఎకరాల్లో వరి సాగు చేసేందుకు అనుకూలంగా ఉంది. ఈ ఏడాది 32,439 మంది రైతులకు వారు కోరిన వరి విత్తనాలు ఇస్తున్నాం. ఇప్పటి వరకు 1918, 1064, 1121, ఎల్2537 (శ్రీకాకుళం సన్నాలు), సోనామసూరి 3291, ఇంద్ర 1061, స్వర్ణ 7029, సాంబమసూరి 5204, తెలంగాతు సన్నాలు 15048, ఎన్ఎల్ఆర్ 4001, నెల్లూరు మసూరి 3449, ఆర్ఎస్ఆర్ 15048, ఎంటియు 1318 రకాలను అందుబాటులో ఉంచాం. 25,324 క్వింటాళ్ల (అపరాలు, చోడి, వేరుశనగ, వరి) విత్తనాలు 90 శాతం రాయితీపై గిరిజనులకు అందించేలా ఆర్‌బికెల్లో సిద్ధం చేశాం. ఖరీఫ్ సాగు సన్నద్ధతపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సాగు పద్ధతులు, అధిక దిగుబడి సాధించే విధానాలు, చీడపీడల నిర్మూలన, ఎరువులు, యంత్రాల వినియోగం, ప్రభుత్వ రాయితీ పథకాల గురించి రైతులకు తెలియజేస్తున్నాం.

ఆధునిక వ్యవసాయ పద్ధతుల అమలుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జిల్లాలో ఆధునిక వ్యవసాయ విధానం అభివృద్ధి చేసేందుకు 11 మందికి డ్రోన్ శిక్షణ ఇప్పించాం. పెద్ద పరిమాణంలో ఉన్న డ్రోన్లు తెప్పించే క్రమంలో కొంత జాప్యం జరిగింది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రైతులకు గతంలో రాయితీపై వ్యవసాయ పరికరాలు అందించేవారు. కొన్నాళ్లుగా అవి మంజూరు కాలేదు. డిమాండు మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం.

విత్తనాలు, ఎరువుల పంపిణీ పై సన్నద్ధత ఎంత వరకు వచ్చింది?

ఎరువుల కొరత లేకుండా చూస్తున్నాం. 45,277 టన్నుల ఎరువులు రావాల్సి ఉండగా గత నెల నుంచే ఆర్‌బికెలకు తరలిస్తున్నాం. మార్క్‌ఫెడ్ గోదాముల్లో అన్ని రకాల ఎరువులు నిల్వ చేశాం. ఇప్పటి వరకు ఆర్‌బికెల ద్వారా 19,549 టన్నులు పంపిణీ చేపట్టాం. ప్రస్తుతం మరో 15,466 టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయి.

నకిలీ విత్తనాల బారిన రైతులు పడకుండా తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

నకిలీ విత్తనాలతో ఏ ఒక్క రైతు నష్టపోకూడదనే ఆలోచనతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. విత్తన పరీక్షలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. 2024-25

ఏడాదికి సంబంధించి అగ్రిల్యాబ్లో విత్తన నాణ్యత పరీక్షలు చేస్తున్నాం. ఆర్‌బికెల ద్వారా 205 శాంపిళ్లు పరీక్షించాం. ఇతర ప్రాంతాల నుంచి 29, రైతుల నుంచి 14 శాంపిళ్లు అందాయి. వాటిని పరీక్షించాల్సి ఉంది.

జిల్లాలో భూసార పరీక్షలు ఎంతవరకు చేపట్టారు?

రైతులకు మేలు చేసేలా భూసార పరీక్షలు చేస్తున్నాం. 2024-25 ఏడాదికి సంబంధించి 12,800 నమూనాలు పరీక్షించాల్సి ఉండగా ఇప్పటి వరకు 8,407 నమూనాలు విశాఖ ల్యాబ్‌కు పంపించాం.

జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై మీ అంచనా ఏమిటి?

ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని 15 మండలాల్లోనూ రైతులు నారుమళ్లను సిద్ధం చేసుకున్నారు. అయితే పార్వతీపురం మన్యం జిల్లాలో వర్షాలు కురియడం కొంతవరకు ఆలస్యమైనప్పటి అయినప్పటికీ ప్రస్తుతం పడుతున్న వర్షాలు ఖరీఫ్ సీజన్‌కు ఎంతో మేలు చేస్తాయి. ఇప్పటికే పాచిపెంట, సాలూరు, పార్వతీపురం, భామిని, సీతానగరం తదితర మండలాల్లో ఆకుమడులు సిద్ధం చేశారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు.

రాష్ట్రాన్ని పాకిస్థాన్‌లా మార్చకండి : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రాన్ని మరో పాకిస్తాన్ లాగో, ఆఫ్ఘనిస్తాన్ లాగో మార్చొద్దని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర హితవు పలికారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చినప్పుడల్లా కక్షసాధింపు చర్యలు చేపట్టడం ఏపార్టీకైనా మంచి సాంప్రదాయం కాదన్నారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని బీహార్‌లా మార్చారని అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు విమర్శించారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి ప్రభుత్వం ఎపిని పాకిస్థాన్‌లా మార్చేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు.అధికారం చేపట్టిన రెండు నెలలు కాకముందే ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలు, తప్పుడు కేసులు, పార్టీ కార్యాలయాలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు ప్రభుత్వం పూనుకొందన్నారు. మూడేళ్ల నాటి కేసుని ఇప్పుడు తిరగతోడడం సరికాదన్నారు. జగన్‌పై హత్యాయత్నం కేసు నమోదుకు ప్రయత్నించడం దారుణమని అన్నారు. ఇప్పుడు జగన్‌ను కేసులో ఇరికించాలని చూస్తే రేపు మళ్లీ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రస్తుత సిఎం చంద్రబాబు నాయుడు, హోం మంత్రి అనిత కూడా బాధ్యత వహించాల్సి వుంటుందని హెచ్చరించారు. తప్పుడు కేసులు పెడితే ఇప్పుడున్న పోలీసు అధికారులు కూడా భవిష్యత్తులో బాధ్యత వహించాల్సి వుంటుందన్నారు. అక్రమ కేసులు, దౌర్జన్యాలు, హింసను ప్రేరేపించే చర్యలు మానుకోవాలని సూచించారు.

ఇటీవల జరిగిన ఎన్నికల ముందు టిడిపి ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై ప్రజలే స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులను నిలదీయాలని రాజన్నదొర కోరారు. అమ్మ ఒడికి బదులుగా ఇప్పుడున్న టిడిపి ప్రభుత్వం అమలు చేయనున్న తల్లికి వందనం పథకం అమలుపై జీవో నెంబర్ 29 జారీ చేసి మళ్లీ తోక ముడిచిందన్నారు. చదువుతున్న ప్రతి విద్యార్థికి అమ్మకు వందనం పథకం కింద 15 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ చాలా స్పష్టంగా చెప్పారని తెలిపారు. దీనిపై ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలని రాజన్నదొర కోరారు.

గవర్నర్ దృష్టి సారించాలి

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి ప్రభుత్వం చేపడుతున్న అక్రమ కేసులు, దౌర్జన్యాలు, విధ్వంసాలపై గవర్నర్ దృష్టి సారించాలని రాజన్నదొర కోరారు. కక్షపూరిత కేసులు, దౌర్జన్యాలు చేయడం సత్సాంప్రదాయం కాదని చెప్పారు.

మంత్రికి వినతిని అందజేస్తున్న జిసిసి కార్మికులు

ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రికి జిసిసి కార్మికుల వినతి

ప్రజాశక్తి - సాలూరు

తమకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని కోరుతూ జిసిసి సబ్బుల తయారీ యూనిట్ కార్మికులు ఆదివారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. విజయనగరం, అరకులోని జిసిసి సబ్బుల తయారీ యూనిట్ కార్మికులు మంత్రి సంధ్యారాణిని ఆమె నివాసంలో కలిసి సమస్యల్ని పరిష్కరించాలని వివరించారు. జిసిసి సబ్బుల తయారీ యూనిట్లలో తయారైన సబ్బులు గతంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు సరఫరా చేసేవారని చెప్పారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమ్మ ఒడి పథకం కింద నేరుగా పిల్లల తల్లుల ఖాతాల్లోకి నగదు జమ చేయడంతో సబ్బులు, ఇతర కాస్మెటిక్ వస్తువుల పంపిణీ నిలిపివేశారని చెప్పారు. దీని వల్ల జిసిసి సబ్బుల తయారీ యూనిట్లలో సబ్బుల ఉత్పత్తి నిలిచిపోయిందని చెప్పారు. గత ఐదేళ్లుగా సబ్బుల యూనిట్లలో పని చేస్తున్న కార్మికులకు పని లేకుండా అయిపోయిందన్నారు. ప్రస్తుతం తాము అరకొర జీతాలతో కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. దీనిపై మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ సబ్బుల తయారీ యూనిట్లపై సిఎం చంద్రబాబు నాయుడు తో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

పవర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేటలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ అందుబాటులోకి వస్తే తప్ప ఈ ప్రాంత గిరిజనులు ప్రాణాలకు భద్రత ఉండదని, అందుకే ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతగా ఆపని చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతి రావు, జిల్లా కమిటీ సభ్యులు ఎ.భాస్కరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న హాస్పిటల్‌లో పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉంచాన్నారు. కొన్ని మందుల్లేవని, వైద్యులు చెప్పి సీటీలు రాయడంతో రోగులు బయట కొనుక్కోవల్సి వస్తుందని అన్నారు. ఆర్థిక స్థోమత లేని గిరినులు కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున తక్షణమే సీతంపేటలో జనరిక్ మెడికల్ షాప్ అందుబాటులోకి డిమాండ్ చేశారు. సీజన్‌లో వైద్యాధికారులు హడావుడి చేసి ఆ తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. మలేరియా, టైఫాడ్‌తో పాటు సికిల్‌సెల్ ఎనిమియా పట్టి పీడస్తున్నా డిప్యూటీ వైద్యాధికారి నిమ్మకు నీరెత్తి నట్టుగా వున్నారని విమర్శించారు. కావున తక్షణమే ఐటిడిఎ సర్వసభ్య సమావేశం నిర్వహించి గిరిజన ప్రాంత సమస్యలైన ఆరోగ్యం, మంచినీరు, విద్య, రోడ్లు, ఇళ్లు తదితర సమస్యలపై చర్చించి ఆదివాసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గురుకులాన్ని సందర్శించిన ఎస్ఎఫ్ఐ బృందం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక బాలికల గురుకుల కళాశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తాము ఉంటున్న భవనం వర్షం పడితే కారిపోతుందని, దీనివల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే కొత్త భవనం నిర్మించాలని కోరారు. కళాశాలలో జువాలజీ, ఇంగ్లీష్‌కు సంబంధించి అధ్యాపకులు లేకపోవడంతో పాఠాలు జరగడంలేదని దీనివల్ల, ఆ సబ్జెక్టులకు సంబంధించి ఏమీ అభ్యసించలేకపోతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మండల ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు బిడ్డక అనిల్, నవీన్ మాట్లాడుతూ ఇప్పటికే కళాశాలలు, పాఠశాలలు పునః ప్రారంభించి నెల కావస్తున్నా సరైన సౌకర్యాల్లేకపోవడం దారుణమన్నారు. తక్షణమే ప్రభుత్వం సరైన వసతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న లెక్చరర్లు, అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని, అలాగే సీజన్ మారుతుండడంతో కాలేజీల్లో, పాఠశాలల్లో మెడికల్ క్యాంపు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల అధ్యక్షులు పి.సంజన, కార్యదర్శి ఎం. సంధ్య మరియు మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నగదు వసూలు లేకుండానే ఇకెవైసి

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - మక్కువ

గ్యాస్ వినియోగదారులకు నుంచి ఎలాంటి వసూళ్లు చేయకుండా ఇకెవైసిలు చేయాలని సాలూరు ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు కనకారావు తెలిపారు. ఆదివారం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన రూ.50 ఇచ్చుకో.. ఇకెవైసి చేసుకో అన్న కథనంపై ఆయన స్పందించారు. గ్రామీణ ప్రాంతంలో ఎక్కువమంది వినియోగదారులు తమ సంస్థలో ఉన్నందున ప్రైవేటు వ్యక్తుల ద్వారా వినియోగదారుల సౌకర్యార్థం గ్రామాల్లో ఇకెవైసి చేయిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జరుగుతున్న వసూళ్లు తమ దృష్టికి రాలేదని, ఇకపై అలాంటివి జరగకుండా చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. సాలూరు పట్టణంలో ఇండియన్ గ్యాస్ కార్యాలయం వద్దకు వచ్చే వినియోగదారులకు ఏ విధమైన రుసుము తీసుకోకుండా ఇకెవైసిలు చేయిస్తున్నామని తెలిపారు. సర్వర్లు ఇబ్బందుల వల్ల ఎక్కువ మంది వినియోగదారులు ఉండడం వల్ల తమ కార్యాలయానికి వినియోగదారుల్ని రప్పించకుండా గ్రామాలకు ప్రైవేటు సిబ్బందిని పంపి ఇకెవైసి చేయిస్తున్నామని తెలిపారు. వారు చేసే వసూళ్లలో ఏజెన్సీకి ఎలాంటి సంబంధం లేదని ఆయన వెల్లడించారు,

సూర్యపీఠంలో త్రుచ సూర్య నమస్కారాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలో ఆదివారం పట్టణ శివారులో ఉన్న సూర్యపీఠంలో త్రుచ సూర్య నమస్కారాలు, సౌర హెూమం సకల కార్య సిద్ధి రామాయణ మంత్ర హెూమం, ఆదిత్య పంచాయతన క్షీరాభిషేకం, మిత్ర, రవి, సూర్య, భాను, ఖగ, పూష హిరణ్యగర్భ, మరీచి, ఆదిత్య సవితృ, అర్క, భాస్కర దేవతలకు పూజలు, నవనాగ అర్చన నవగ్రహ హెూమాలు బ్రహ్మశ్రీ వేమకోటి నరహరిశాస్త్రి అధ్వర్యంలో జరిగాయి. రాజాం జిసిఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.పురుషోత్తం, తెలుగు అధ్యాపకుల టి.విశ్వనాధం, గణితశాస్త్ర అధ్యాపకుల శ్రీనివాసరావు, జి.ఎంఆర్ఐటి కళాశాల ఎఒ కెవి సన్యాసిరాజు (సాయిరాజు), ప్లేస్‌మెంట్ డిపార్టుమెంటు శ్రీనివాసరావు, మెకానికల్ విభాగ ఉపాచార్యులు ఎం.రఘువర్మ, టెక్నికల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం సూర్య పీఠాన్ని దర్శించారు. వేమకోటి వివేకానంద్ తదితరులు వైదిక సహకారం అందించారు.

పూజల్లో పాల్గొన్న రాజాం డిగ్రీ కాలేజీ సిబ్బంది

ఆదివాసీలకు అండగా 'ఆర్ట్స్'

ప్రజాశక్తి - సీతంపేట

ఏజెన్సీలో 30ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ గిరిజన గ్రామాల్లో ఆదివాసీల కోసం వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి వారికి ఎంతో అండగా నిలుస్తోంది. గిరిజనులకు అనేక స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా ఆర్థికంగా వారికి ఎంతో చేయుతనిస్తోంది. ఇప్పటికే పైనాపిల్ (అనాస పనస) మార్కెట్ ధర పడిపోయిన సమయంలో నేను ఉన్నాను అని ఆర్ట్స్ సంస్థ ముందుకొచ్చి మార్కెట్ ధర కల్పించడానికి ఒక్క అడుగు ముందుకేసింది. పైనాపిల్ మార్కెట్ ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించారు. నాబార్డ్ సహకారంతో ఏర్పాటు చేసిన మన్యం సహజ ఉత్పత్తిదాల కంపెనీ, వన మిత్ర, వన సహజ, ఆదివాసీ మహిళ ఉత్పత్తిదారుల కంపెనీలో ఈ ఏడాది పైనాపిల్ సీతంపేట ఐటిడిఎ సహకారంతో విశాఖపట్నం, విజయనగరం రైతు బజార్లలో మార్కెట్ ధరకు అమ్మకం చేపట్టారు. తద్వారా రైతులకు మంచి ఆదాయం చేకూరింది. ముఖ్యంగా ఈ ఏడాది సీజన్లో 85వేల పైనాపిల్ కాయలను మార్కెట్ చేయడం జరిగింది. ఒక్కొక్క కాయ ఈ ఏడాది సంతల్లో పది రూపాయల నుండి 15 రూపాయల వరకు మాత్రమే ఇక్కడ అమ్మడం ద్వారా ఆదాయం వచ్చేది. కానీ విశాఖపట్నంలో ఒక్కొక్క 30 రూపాయల నుంచి 40 రూపాయలు వరకు ఆదాయం పొందడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పైనాపిల్ విలువ ఆధారిత శిక్షణ కార్యక్రమం ద్వారా ఆదివాసీ యువతకు పైనాపిల్‌తో జ్యూస్, జామ్ క్యాండీస్ వంటివి పోషక విలువలు ఉన్నటువంటి ఉత్పత్తులు చేశారు. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం వారి సాంకేత సహకారంతో రైతులకు శిక్షణ కార్యక్రమాలు అందించి వారికి అదనపు ఆదాయం వచ్చేలా కృషి చేశారు. అలాగే ఈ పైనాపిల్లో మంచి పోషకాలు ఉన్నందున మార్కెట్లో మంచి గిట్టుబాటు ధర ఉంది. రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ద్వారా ఆదివాసీ ప్రాంతాల్లో వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా ప్రణాళిక తయారు చేశారు. అలాగే యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాల ద్వారా సుస్థిర ఆదాయం వచ్చేలా సంస్థ కృషి చేసింది.

పైనాపిల్ కు ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం

ఐటిడిఎ సహకారంతో ఈ ఏడాది వన్ దన్ వికాస కేంద్రం (విడివికె) ద్వారా పైనాపిల్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ఆర్ట్స్ సంస్థ కృషి చేస్తుంది. అలాగే రైతులకు మరిన్ని శిక్షణా కార్యక్రమాలు, పంటల్లో సాంకేతిక పరిజ్ఞానంతో మరింత అభివృద్ధి కృషి చేస్తున్నాం .

బి.శంకర్రావు, సిఇఒ,
మన్యం సహజ ఉత్పద్దారుల కంపెనీ.

పైనాపిల్‌కు మద్దతు ధర కల్పించడంలో ముందడుగు

నాబార్డ్ సహకారంతో సుస్థిర ఆదాయం

గిరిజనులు ఆరు గాలం శ్రమించి సేకరించి పైనాపిల్ ఉత్పత్తులకు మార్కెట్ ధర లేకపోవడంతో నాబార్డ్ సహకారంతో ఆదివాసీలకు సుస్థిర ఆదాయం కల్పించాలని ఉద్దేశంతో విశాఖపట్నం, విజయనగరం ప్రముఖ పట్టణాల్లో రైతు బజారులో పైనాపిల్ కాయలు విక్రయించేలా మార్కెట్ ధర కల్పించాం. మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ, వనమిత్ర, వన సహజ ఆదివాసీ మహిళ ఉత్పత్తి కంపెనీల సహకారంతో సుస్థిర ఆదాయం సంపాదించడానికి కృషి చేశాం.

నూక సన్యాసిరావు,
ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్.

పైనాపిల్ జ్యూస్ తయారీలో శిక్షణ పొందుతున్న గిరిజన యువత

రైతు ఉత్పత్తి దారుల కంపెనీల ద్వారా ఆదాయం

రైతు ఉత్పదారుల కంపెనీ ద్వారా గిరిజనులు పండించిన పంటలకు మార్కెట్ ధర కల్పిస్తుంది. ఈ కంపెనీలు ఆర్ట్స్ సంస్థ ఏర్పాటు చేసింది. గిరిజనులకు పైనాపిల్ జ్యూస్ తయారీలో శిక్షణలు కూడా ఇచ్చాం. వాటి విలువలు పోషకాలు గురించి తెలియజేశాం.

- నిమ్మక వరహాలమ్మ, ఛైర్మన్
మన్యం సహజ ఉత్పత్తి దారుల కంపెనీ

నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి

నేడు వరల్డ్ స్కిల్ డే

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

యువత నైపుణ్యాభివృద్ధి సాధిస్తేనే ఉపాధి అవకాశాలకు మెండుగా లభిస్తాయి. ఇందులో భాగంగా ప్రభుత్వం యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తూ ఉపాధి కల్పిస్తుంది. దీన్ని వినియోగించుకొని అనేక మంది యువతీ, యువకులు వివిధ రంగాల్లో ఉపాధి పొందుతూ రాణిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఏటా ఏడాది జూలై 15న ప్రపంచ నైపుణ్య దినోత్సవం (వరల్డ్ స్కిల్ డే) జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ దినోత్సవాన్ని పురష్కరించుకొని పార్వతీపురం మన్యం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ జిల్లాలో తమ కేంద్రాల ద్వారా చేపట్టిన జాబ్‌మేళాలు, యువకు ఇచ్చిన వివిధ శిక్షణల గురించి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే...

జిల్లాలో గల నాలుగు స్కిల్ హబ్ ద్వారా ఇప్పటి వరకు సుమారు 1005 మందికి వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చాం. వీరిలో సుమారు 650 మంది వరకు వివిధ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కూడా పొందారు. సీతంపేట ఐటిఐ, గుమ్మలక్ష్మీపురంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్, పార్వతీపురం మండలం ఎంఆర్ నగర్‌లోరి పాలిటెక్నిక్ కాలేజీ, సాలూరులోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలోనూ స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేశాం. ఈ నాలుగు స్కిల్ హబ్‌లు లో , కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్టివ్, డోమ్బిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, క్రెడిట్ ప్రాసెసింగ్ ఆఫీసర్, ఎలక్ట్రీషియన్, స్వీయింగ్ మిషన్ ఆపరేటర్, రిసెప్షనిష్ట్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇచ్చాం. అలాగే సీతంపేట వైటిసిలో ఏర్పాటు చేసిన స్కిల్ కాలేజీ అందులో ఫుడ్ ఔట్లెట్ మేనేజర్, టెక్నికల్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇచ్చాం. ఇప్పటి వరకూ 120మంది శిక్షణ పొందగా, 90మంది వరకు ఉపాధి పొందారు.

జిల్లా ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 22 మినీ, మెగా జాబ్ మేళాలు ఏర్పాటు చేసుమారు 2468 మందికి ఉపాధి కల్పించాం. కమల్ వెల్ఫేర్ ఫౌండేషన్ అందజేసిన రూ.5లక్షల నిధులతో భద్రగిరి ఐటిఐలో జనరల్ ప్లంబర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఇది మన్యం జిల్లాలో ఉండే యువతకు చాలా బాగా ఉపయోగపడుతుంది.

జిల్లాలో 9 వరకు ఇఎస్‌సి కేంద్రాలు ఉన్నాయి. డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఈ కేంద్రాల ద్వారా శిక్షణ ఇస్తున్నాం. పైథాన్, జావా, కమ్యూనికేషన్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, డిజిటల్ మార్కెటింగ్ వంటి స్కిల్స్ నేర్పిస్తున్నాం. ఇప్పటి వరకు మన్యం జిల్లాలో 1783 మంది వరకు స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఈ శిక్షణ ఇచ్చాం. అలాగే జిల్లాలో సుమారు 5 వరకు ప్రవేట్ ట్రైనింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా ఇప్పటి వరకు 330 మంది శిక్షణ పొందారు. బ్యూటిషియన్ కోర్సు, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ హార్డ్ వేర్ టెక్నీషియన్, ఫ్రంట్ ఆఫీస్ ఎక్స్టెక్టివ్, ఎసి టెక్నీషియన్, సోలార్‌ప్యానెల్‌బోర్డు టెక్నీషియన్ వంటి కోర్సులకు శిక్షణ ఇచ్చాం. గుమ్మలక్ష్మీపురం వైటిసిలో గత నాలుగు నెలలో 60 మందికి జనరల్ డ్యూటీ అసిస్టెంట్, మరియు ఇతర రంగాల్లో శిక్షణ ఇస్తున్నాం.

జాబ్‌మేళాలో ఉపాధి పొందిన యువత (ఫైల్)

డిసిసిబి ఛైర్మన్ రేసులో కర్నేన?

ప్రజాశక్తి - పాలకొండ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నామినేటెడ్ పదవులపై అందరి చూపు పడింది. రెండున్నర ఏళ్ల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు రావడంతో నామినేటెడ్ పదవులపై అందరి దృష్టి పడింది. మొదటి నుండి టిడిపిలో కొనసాగుతూ ఒడిదుడుకులు ఎదురుకున్న కర్నేని అప్పలనాయుడు డిసిసిబి ఛైర్మన్ రేసులో ఉన్నట్లు తెలుస్తుంది. ఉమ్మడి జిల్లాకు చెందిన ఈ పదవి పాలకొండ డివిజన్‌కే అవసరం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఈ డివిజన్‌లోనే 49 మంది సొసైటీలు ఉండడంతో ఈ ప్రాంతానికి పదవి వస్తే రైతులకు మేలు చేకూరుతుందని పలువురు భావిస్తున్నారు. ఇప్పటి వరకు డిసిసిబి ఛైర్మన్ పదవి చేపట్టిన వారు కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులే. డోల సీతారాం, డోల జగన్, పాలవలన రాజశేఖరం, సిరిపురపు వెంకటరమణ, పాలవలన విక్రాంత్‌తో పాటు మరికొంతమంది ఉన్నారు. అయితే కూటమి ప్రభుత్వం కూడా అదే సామాజిక వర్గానికి పదవి కట్టబెడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో జనసేన పార్టీ తరపున ఎమ్మెల్యే ఉండగా, టిడిపిలో నియోజకవర్గ స్థాయిలో నాయకత్వం బలంగా ఉండాలంటే ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తికి ఛైర్మన్ పదవి ఇవ్వాలని ఆ పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇప్పటికే ఎమ్మెల్సీగా ఉన్న పాలవలన విక్రాంత్‌కు ధీటుగా ఎదుర్కోవాలంటే టిడిపిలో అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఉన్నత పదవి ఇవ్వాలన్న చర్చ జరుగుతుంది. అధిష్టానం కూడా అదే ఆలోచనలో ఉండడంతో అప్పలనాయుడుకు ఏదైనా మంచి పదవి వస్తుందని స్థానిక నాయకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో పార్టీ కోసం పని చేసిన అప్పలనాయుడు ఈ పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తుంది. కూటమి అభ్యర్థి జయకృష్ణ గెలుపుకు అప్పలనాయుడు కృషి ఎంతో ఉందని ఆయన అనుచర వర్గాలు బహిరంగంగా చెప్తున్నాయి. డిసిసిబి ఛైర్మన్ లేదా ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పదవిని ఆయన ఆశిస్తున్నట్లు తెలుస్తుంది. నియోజకవర్గంలో కీలక నేతగా గుర్తింపు పొందిన అప్పలనాయుడుకు ఏ పదవి వరిస్తుందో వేచి చూడాలి

సహారా బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

డబ్బులు కట్టిన సహారా బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సహారా బాధితులకు భరోసా కల్పించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం కొమరాడలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2012 నుండి మెచ్యూరిటీ సమయమైన వారికి కనీసం డబ్బులు చెల్లించకపోవడం చాలా అన్యాయం అన్నారు. ఈ విషయమై గత కొన్నేళ్లుగా సిపిఎం ఆధ్వర్యంలో పార్వతీపురంలో గల సహారా కార్యాలయం వద్ద ఆందోళన చేసినా ప్రయోజనం లేదన్నారు. కనీసం యాజమాన్యం వీటిపై చర్చించని పరిస్థితి ఉందన్నారు. సహారా కంపెనీ నమ్ముకొని డబ్బులు కట్టిన వారంతా పేదలేనని, వారి డబ్బులు చెల్లించి అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.

తీర్థయాత్రలో చిక్కుకున్న యాత్రికులు

తీర్థయాత్రలకు వెళ్లి వరదల్లో చిక్కుకున్న మన్యం వాసులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లా కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల నుంచి నేపాల్ పర్యటనకు ఈనెల 3న కురుపాం నుంచి 18 మంది, గుమ్మలక్ష్మీపురం నుంచి ఐదుగురు కుటుంబ సమేతంగా తీర్థయాత్రలకు బయలుదేరారు. వీరు కాశీ నుంచి నేపాల్ ముక్తినాదిని దర్శించుకోవడానికి బస చేయడానికి వెళ్లారు. అక్కడికి చేరుకున్న తర్వాత రెండు రోజులుగా నేపాల్‌లో ఎడతెరిపిలేని వర్షం కురుస్తుండడంతో వరదల్లో చిక్కుకొని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక రోజంతా నీరు, ఆహారం లేక చాలా ఇబ్బందులు పడ్డామని యాత్రికులు తెలిపారు. ఎవరికైనా ఫోన్ ద్వారా తెలియజేస్తామన్నా ఫోన్ సౌకర్యం లేక చాలా ఇబ్బంది పడ్డామని తెలిపారు. శుక్రవారం సాయంత్రం నేపాల్ ప్రభుత్వం యాత్రలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రోడ్డు విస్తరణ పనులు చేయడంతో సురక్షిత ప్రాంతానికి చేరుకున్నామని గుమ్మలక్ష్మీపురం వాసి కొనిస సూర్యప్రకాష్ ఫోన్లో కుటుంబ సభ్యులు కు తెలిపారు. తమతో వచ్చిన వాళ్లంతా సురక్షితంగా ఉన్నారని ఎవరూ ఆందోళన చెందవద్దని యాత్రికులు తెలిపారు.

గ్రంథాలయం పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

గ్రంథాలయానికి వెళ్లాలంటేనే కంపు కంపు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో గల శాఖా గ్రంథాలయంలోకి వెళ్లాలంటే ముక్కుమూసుకొని వెళ్లాల్సిందే. చుట్టూ పెంట కుప్పలు, మురికి నీరు గ్రంథాలయం చుట్టూ అపారిశుధ్యం తాండవమాడుతుంది. దీంతో పాఠకులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై నగర పంచాయతీ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గుంతల రోడ్లతో ప్రయాణికులకు అవస్థలు

ప్రజాశక్తి - కురుపాం

ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా, ఎందరు అధికారులు మారినా ఏజెన్సీ రహదారుల దుస్థితి మాత్రం మారడం లేదు. కొన్నేళ్లుగా మోకాళ్ల లోతు గుంతలతో రహదారులు దర్శనమిస్తున్నాయి. కురుపాం నుంచి పార్వతీపురం వెళ్లే ప్రధాన రహదారిపై నియోజకవర్గ కేంద్రమైన కురుపాం, పెదమేరంగి జంక్షన్ వద్ద ఏర్పడ్డ గోతుల వల్ల రహదారులు అస్తవ్యస్తంగా ఉండడంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు. ఈ రహదారుల గుండా నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఇటీవల రహదారులపై ఏర్పడిన గోతుల్లో పడి పలు వాహనాలు ఉయ్యాల జంపాల లాగా ఊగుతూ పడిపోయాయి. బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు సైతం గోతులున్నచోట కుదుపులకు బస్సులో కూర్చోలేని పరిస్థితి. దీంతో అనేక ఇబ్బందులుకు గురవుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో గోతులు కనిపించకపోవడంతో ఆ గోతుల్లో పడి ద్విచక్ర వాహనాదారులు ప్రమాదాల బారినపడి కాలు, చేతులు విరిగిన సంఘటనలు ఎన్నో చోటుచేసుకున్నాయి. ఇటీవల పడ్డ వర్షాల వల్ల గోతుల్లో నీళ్లు చేరి వాహనదారులకు దర్శనమిస్తున్నాయి. గోతుల్లో దిగిన వాహనాలు త్వరగా మరమ్మతులకు గురవుతున్నాయని ద్విచక్ర వాహనాదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి గోతులమయంగా ఉన్న రహదారులు మరమ్మతులు చేయాలని పలువురు ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

అధ్వాహ్నంగా ఉన్న మొండెంఖల్‌కు వెళ్లే రోడ్డు

గౌరవప్రదమైన వేతనం మంజూరు చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఆదివాసీ మాతృ బహు బాషా విద్యా వాలంటీర్లకు గౌరవ ప్రదమైన వేతనాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించాలని ఆసంఘ రాష్ట్ర కార్యదర్శి సవర డొంబు, జిల్లా అధ్యక్షులు ఆనందరావు, మండల అధ్యక్షులు సవర ఎల్లంగో డిమాండ్ చేశారు. అలాగే కొన్ని వృత్తుల వారు వారి విద్యార్హత, నైపుణ్యం ద్వారాగానే వేతనాలు మంజూరు చేస్తారన్నారు. ఎంటిబి మేల్ విద్యా వ్యవస్థలో మాత్రమే రూ.5వేలు వేతనంతో విధులు కొనసాగించాలని ఆదేశాలు ఉన్నాయన్నారు. కావున విద్యా శాఖ మంత్రి, ఉన్నతాధి కారులు స్పందించి తగు న్యాయం చేయాలని కోరారు.

ఇనుప చక్రాల ట్రాక్టర్లు రహదారులపై ప్రయాణిస్తే చర్యలు

ప్రజాశక్తి - మక్కువ

ప్రస్తుత ఖరీఫ్ కాలంలో దమ్ములు మొదలైన సందర్భంగా ట్రాక్టర్లను ప్రధాన రహదారుల్లో ఇనుప చక్రాలతో నడిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి.నరసింహమూర్తి హెచ్చరించారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి రహదారులను బాగుచేసినప్పటికీ దమ్ముకు ఉపయోగించే ఇనుప చక్రాలు రహదారులను పాడు చేసే ఆస్కారం ఉందన్నారు. కావున ట్రాక్టర్ల యజమానులు ఇనుప చక్రాలకు ఇనుప బెల్టును వినియోగించి రహదారులపై ప్రయాణించాలని సూచించారు. దీనిపై త్వరలో ట్రాక్టర్ల డ్రైవర్లు యాజమాన్లతో సమావేశం నిర్వహిస్తామన్నారు. రహదారుల భద్రత దృష్ట్యా నిబంధనలను బేకాతరు చేసే ట్రాక్టర్లను ఇనుప చక్రాలతో నడిపితే చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని గంగాడకు చెందిన గంట సావిత్రమ్మ (56) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై వి.పాపారావు తెలిపారు. పార్వతీపురం రూరల్ సిఐ వి.రవికుమార్ ఇచ్చిన వివరాల ప్రకారం గంగాడలోని గంట సావిత్రమ్మ కనిపించడం లేదని ఆమె మేనల్లుడు హేమ్‌కుమార్ పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేశాడు. అనంతరం పోలీసులు దర్యాప్తు చేయగా ఆమె మృతదేహం గ్రామానికి 500 మీటర్ల దూరంలో ఉన్న రామన్న చెరువులో ఆదివారం లభ్యమైంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గోతులు కప్పుతున్న నాయకులు

గోతులు కప్పిన టిడిపి, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కొమరాడ

అధికారుల స్పందించకపోయినా టిడిపి, సిపిఎం స్థానిక నాయకులు రోడ్డుపై ఉన్న గోతులు కప్పేందుకు స్పందించారు. ఆదివారం పార్వతీపురం నుంచి కూనేరు వరకు గల అంతర్ రాష్ట్ర రహదారిపై భారీగా గొంతులు ఉండడంతో వాహనదారుల ఇబ్బందులను గుర్తించిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి గులిపల్లి సుదర్శనరావు బేబీ చిప్స్ రాయి పంపగా, కొమరాడ శివాలయం వద్ద నిత్య నరకంగా మారిన గోతిని నాయకులు పూడ్చారు. అలాగే సుమారు 200 మీటర్ల పొడవు ఉన్న గోతులను మండల టిడిపి అధ్యక్షులు శనపతి ఉదయ శేఖర్ పాత్రుడు పంపిన బేబిచిప్స్‌ను కప్పారు. తెలుగు రైతు మండల అధ్యక్షులు బత్తి శ్రీనివాసరావు రాళ్లు, కంకర వంటివి గోతుల్లో వేయించి చదును చేయించారు. ఈ సమస్యల పరిష్కారానికి మేము సైతం అంటూ సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, స్థానిక టిడిపి నాయకులు బొంగు భానోజీరావు స్థానికంగా వేసిన మెటీరియల్‌ను చదును చేసి వాహన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. దీంతో రోడ్డుపై గోతులు కప్పినందుకు నాయకులను వాహనదారులు, స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో గులిపల్లి మురళీ, పాలక నూకరాజు, ఎం.వెంకట్ నాయుడు, కోంద్రు తిరుపతి, మడక కృష్ణ, పడాల జిజ్జీ, ఉదమల మురళీ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు రక్ష పరీక్షలు నిర్వహించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో జ్వరాలు తీవ్రత పెరుగుతున్నందున గిరిజనులందరికీ రక్షపరీక్షలు చేసి, మలేరియా నివారణ మందులు అందుబాటులో ఉంచాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, సతాబి గిరిజన గ్రామం వద్ద సర్పంచ్ శిల్పజన్ని రామయ్య, మాజీ సర్పంచ్ సార లచ్చయ్య అధికారులను కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ పిహెచ్‌సిల వద్ద మలేరియా కిట్లు ప్రజలకు సరిపోయేలాఉంచాలని గిరిజన గ్రామాలన్నింటికీ ఏకకాలంలో దోమతెరలు పంపిణీ చేసి ఆదుకోవాలని, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పౌష్టికాహార లోపం లేకుండా జిల్లా ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షణలో ఆశ్రమ పాఠశాలను నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి నిత్యం ఎఎన్ఎంలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు గిన్నెల భీమారావు ఎస్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.